


నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం

అహోబిలం జీయర్ స్వామి నేతృత్వంలో ములకలాపల్లి వద్ద శ్రీనివాస కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. II లో



సిరులతల్లికి క్షీరాభిషేక సేవ

విశాఖ: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.



రాజ్యాంగ ప్రదాత II లో

అనకాపల్లి మండలం సంపతిపురంలో అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు అజేయ కల్లం ఆవిష్కరించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శు)	సహర్ (ఆది)
అనకాపల్లి	6-16	4-25
నర్సీపట్నం	6-20	4-24

అంబేడ్కర్ అడుగుజాడల్లో..



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి



దేవరాపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

- అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి
- రాజ్యాంగం స్ఫూర్తితో అసమానతల తొలగింపు
- ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

అనకాపల్లి టౌన్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి ధర్మశ్రీ, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ డాక్టర్ బి.వి. సత్యవతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీనగరం జీవీఎంసీ కల్యాణమండపం మేడపైన ఎస్సీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో అంబేడ్కర్ చిత్రపటానికి వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ అంబేడ్కర్ అణగారిన వర్గాల తలరాతలు మార్చారని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ అంబేడ్కర్ మనకు ఇచ్చిన రాజ్యాంగం స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని అన్నారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ విద్య ద్వారానే అన్ని అసమానతలను రూపుమాపవచ్చని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. జేసీ ఎం. జాహ్నవి, డీఆర్వో పి.వెంకటరమణ, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా అధికారి టి.అజయ్‌బాబు, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి కె.రాజేశ్వరి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎస్సీ సెల్ జిల్లా మానిటరింగ్ కమిటీ మెంబర్ రేబాక మధుబాబు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

పోలీసులు రాజ్యాంగ పరిధిలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని ఎస్పీ కె.వి. మురళీకృష్ణ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, క్రైం అడిషనల్ ఎస్పీ పి.సత్యనారాయణరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, పైడపునాయుడు, అప్పలనాయుడు, ఎస్‌ఐలు చక్రధర్, లక్ష్మణ్, శ్రీనివాస్, రఘువర్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో..

మహనీయుల ఆశయసాధనకు నేటి యువత కృషి చేయాలని ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆ మహనీయుని చిత్రపటానికి ధర్మశ్రీ, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతిలు పూలమాలలు వేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుని స్ఫూర్తితో విప్లవాత్మక పాలన

- అంబేడ్కర్ ఆశయాలను అమలు చేస్తున్న సీఎం జగన్
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కల్పనే ధ్యేయంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక పాలన సాగిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లిలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం కేక్‌ను కట్ చేశారు. స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ సమకూర్చిన దుస్తులను పారిశుధ్య కార్మికులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సమసమాజ స్థాపనే లక్ష్యంగా సీఎం జగన్ ఎస్సీ కమిషన్, ఎస్టీ కమిషన్‌తోపాటు బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని, బీసీ జనగణనకు తీర్మానం చేశారని చెప్పారు.

జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు, కల్లుగీత డైరెక్టర్ సిమ్మ అప్పన్న, తహసీల్దార్ ఎం.లక్ష్మి, సీఐ ఎస్.తాతారావు, అంబేడ్కర్ యూత్ ప్రతినిధులు కంచమాల అప్పారావు, కాటపల్లి నాగభూషణం, ఉల్లి దేముడు తదితర సభ్యులు పాల్గొన్నారు.

భగ్గుమన్న ఉక్కు కార్మికులు

- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం
- కూర్మన్నపాలెం హైవేపై ఉద్రిక్తత



జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గేదిలేదన్న కేంద్రం తాజా వ్యాఖ్యలపై ఉక్కు కార్మిక సంఘాల భగ్గుమన్నాయి. కేంద్ర మంత్రిత్వ శాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేదిలేదని చెప్పడంపై కార్మికులు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు రోడ్డెక్కారు. కూర్మన్నపాలెం కూడలిలోని జాతీయ రహదారిపై శుక్రవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి.. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఆందోళనకు దిగిన కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించడంతో.. కార్మికులు ప్రతిఘటించారు. దీంతో హైవేపై కొంత సమయం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులకు, కార్మికులకు మధ్య తోపులాట జరగడంతో ట్రాఫిక్ స్తంభించింది. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే ఎంతకైనా పోరాడతామని ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసిన కార్మిక సంఘాల నాయకులను దువ్వాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సంచలనంగా కాల్ రికార్డ్

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ అంశంపై మాట మార్చడం సరికాదన్నారు. కార్మికులు ఆందోళనకు వెళ్లకుండా కేంద్రప్రభుత్వం ఎత్తుగడ వేసిందని చెప్పారు. మొదట స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం వెనక్కి తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించి తర్వాత మాట మార్చడం తగదన్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి విశాఖ ట్రోఫీ ఫుట్‌బాల్



పోటీలకు సిద్ధంగా రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్

విశాఖ స్పోర్ట్స్ : మూడు దశాబ్దాల విరామం అనంతరం విశాఖ ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీలు నగరంలో జరగనున్నాయి. శనివారం నుంచి ప్రారంభం కానున్న ఈపోటీలకు రైల్వేస్టేడియం సిద్ధమైంది. ఈ ఆహ్వాన ఫుట్‌బాల్ ట్రోఫీలో 16 జట్లు నాలుగు పూల్స్‌లో తలపడనున్నాయి. ప్రతిరోజు రెండు మ్యాచ్‌లు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరగనుండగా 23వ తేదీన ఫైనల్ జరగనుంది. విజేతకు లక్ష, రన్నరప్‌కు రూ.50వేలు ప్రోత్సాహకాన్ని అందుకోనున్నారు. సునేబేడా, బ్లూస్టార్స్, మధ్యప్రదేశ్, ఏపీ, చెన్నై, విశాఖ, హైదరాబాద్, సిటీఎఫ్‌సీ, నాగపూర్, శ్రీధర్ స్పోర్టింగ్, ఎన్ఎఫ్ఎ, కోల్‌కతా, ఎస్ఏటీ, బర్గా, చత్తీస్‌గఢ్, డైచిమన్ ఫుట్‌బాల్ క్లబ్ జట్లు తలపడనున్నాయి. ప్రారంభ మ్యాచ్‌లో సునబేడా జట్టుతో బ్లూస్టార్స్ జట్టు తలపడనుంది.

రేపు భగవద్గీతపై అష్టావధానం

అనకాపల్లి టౌన్: స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్లో ఈనెల 16న ఆంధ్ర పద్యకవితా సదస్సు సాహితీ సంస్థ ఆధ్వర్యంలో 'భగవద్గీత–అష్టావధానం' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పద్యకవితా సదస్సు జిల్లా అధ్యక్షుడు మెరుగుమిల్లి వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం (తిరుపతి) ప్రతినిధి యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు అవధానం చేస్తారని తెలిపారు.

సాహిత్య సంబరాల్లో 'పిల్లా'కు ఆహ్వానం

సీతంపేట(విశాఖ ఉత్తర): తెలుగు వెలుగు సాహిత్య వేదిక, ఎస్‌వీ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్న జాతీయ సాహిత్య సంబరాలలో పాల్గొనాలని విశాఖకు చెందిన విశ్రాంత సంస్కృత అధ్యాపకుడు పిల్లా వెంకటరమణమూర్తికి ఆహ్వానం అందింది. రమణమూర్తి రచించిన కవిత సంకలనానికి ఎంపిక చేశామని, జాతీయ సాహిత్య సంబరాల సందర్భంగా విడుదల చేసే సంకలనంలో కవితను ప్రచురిస్తామని నిర్వాహకులు లేఖ ద్వారా తెలిపారు.

అగ్నితో అప్రమత్తం



వారోత్సవాల్లో పాల్గొన్న ఫైర్ సిబ్బంది



అగ్నిప్రమాదాల్లో అసువులు బాసిన ఉద్యోగులకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

- వేసవిలో ప్రమాదాలకు ఆస్కారం
- జిల్లా ఫైర్ ఆఫీసర్ లక్ష్మణస్వామి
- అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

అనకాపల్లి టౌన్: మానవ తప్పిదాల వల్ల కొన్ని ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని, వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి బి.లక్ష్మణస్వామి తెలిపారు. స్థానిక అగ్నిమాపకశాఖ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకూ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రతి రోజూ పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రమాదాల నివారణ బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం అగ్ని ప్రమాదాల్లో మృతిచెందిన అగ్నిమాపకశాఖ సిబ్బంది ఎస్‌హెచ్.వాసుదేవ్ సదాశివ(గోవా), ప్రవీణ్‌కుమార్(ఢిల్లీ), లిథిన్ సింగ్(ఉత్తరాఖండ్)కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి అగ్నిమాపకశాఖ అధికారి బి.నరసింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'వయలెంట్' సీఐపై సీరియస్

- సాక్షి కథనంతో జిల్లా పోలీసు శాఖలో ప్రకంపనలు
- వసూళ్ల దందాపై ఉన్నతాధికారులు సీరియస్
- కాల్‌డేటా పరిశీలన.. భూ వ్యవహారాలపై రహస్య విచారణ



సాక్షి, అనకాపల్లి: 'సైలెంట్ కాదు...వయలెంట్!' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన వార్త జిల్లా పోలీస్‌శాఖలో కలకలం రేపింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ 'ప్రత్యేక' పోలీస్ అధికారిపై ఉన్నతాధికారులతో పాటు ఇంటిలిజెన్స్ అధికారులూ గోప్యంగా విచారణ చేపడుతున్నారు. భూ వివాదాల్లో తలదూర్చడంతోపాటు, సబ్బవరం, పెందుర్తి ప్రాంతాల్లో పేకాట డెన్‌ల నుంచి నెలవారీ వసూళ్లకు పాల్పడుతున్న సదరు అధికారి విషయాలపై ఆరా తీస్తున్నారు. ఈ విభాగం నుంచి ఏయే స్టేషన్లలో సదరు అధికారికి సహకరిస్తున్నారన్న విషయంపై కూడా దృష్టి పెట్టారు. వారి విచారణలో జిల్లా పోలీస్ విభాగంలో స్పెషల్ బ్రాంచికి చెందిన ఓ సీఐగా ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. గతంలో ఆయన పలు భూలావాదేవీల్లో కేవలం ఒకరికి కొమ్ముకాసి మరొకరికి అన్యాయం చేసిన వైనాలు మొత్తం ఆరా తీస్తున్నారు. వాటి పూర్వాపరాలను విచారిస్తున్నారు. లబ్ధి పొందినవారు, బాధితుల వివరాలు సేకరిస్తున్నారు.

సంచలనంగా కాల్ రికార్డ్

సదరు ఇన్‌స్పెక్టర్ బెదిరింపుల కాల్ రికార్డ్ సంచలనం సృష్టిస్తోంది. సబ్బవరానికి చెందిన ఓ ప్రైవేటు భూవ్యవహారం విషయంలో ఒక వ్యక్తిని జీపునకు కట్టి ఈడ్చుకొస్తానంటూ చేసిన హెచ్చరిక హాట్ టాపిక్‌గా మారింది. దీంతో సదరు అధికారి కాల్‌డేటాను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అలాగే కాల్‌డేటా ఆధారంగా ఇటీవల కాలంలో చేసిన భూ వ్యవహారాలపై రహస్య విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు ఆయన గతంలో పనిచేసిన పోలీస్‌స్టేషన్ల పరిధిలో కొంతమంది రియల్టర్లు, సన్నిహితంగా ఉన్న వారి సమాచారంపై కూడా ఆరా తీస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఆయన గతంలో పనిచేసిన సబ్బవరం పరిధిలో ఏయే భూ వివాదాల్లో సీఐ జోక్యం చేసుకున్నారు..? ఎవరితో ఫోన్‌లో నేరుగా బెదిరింపులకు పాల్పడ్డారు..? అనే సమాచారాన్ని రాబడుతున్నారు.

ఆయా బాగోతాలపై పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు. ఈ వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు జరుగుతోంది. ఈ విచారణలో వెల్లడైన వాస్తవాలకు అనుగుణంగా సదరు అధికారిపై చర్యలు తీసుకొనే అవకాశం ఉందని పోలీస్ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

నిప్పుల కుంపటి

చోడవరంలో 40.5° | అనకాపల్లిలో 39.8°



ఖాళీగా ఉన్న చోడవరం మెయిన్‌రోడ్డు

- నిర్మానుష్యంగా ప్రధాన రహదారులు
- సాయంత్రం 5 గంటలైనా అదే వేడి
- గతేడాదితో పోల్చితే ఇపుడే అధికం

అనకాపల్లిటౌన్/చోడవరం : ఐదారురోజులుగా ఎండలు తారెత్తిస్తున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. 11 గంటలు దాటితే పట్టణవాసులు ఇళ్లకే పరిమితమవ్వాల్సిన పరిస్థితి. అత్యవసర పనులపై వెళ్లేవారు తప్ప మరెవరూ కనిపించకపోవడంతో 12 గంటలకే ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. చోడవరంలో శుక్రవారం ఏకంగా 40.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఉదయం కనిష్ట ఉష్ణోగ్రత 27 డిగ్రీలు ఉండగా, మధ్యాహ్నం 1 గంటకు 40.5 డిగ్రీలకు చేరింది. పెరుగుతూ వచ్చిన ఉష్ణోగ్రతతోపాటు వడగాల్పులు కూడా తోడయ్యాయి. దీంతో ఇళ్లల్లో ఫ్యాన్ల కింద ఉన్నా.. జనాలకు ఉక్కబోత తప్పట్లేదు. కాస్త మోస్తరు ఆదాయం ఉన్నవారు తమ ఏసీ గదుల్లో సేదతీరుతున్నారు. సాయంత్రం 5 గంటలైనా సూరీడు కనికరించని పరిస్థితి. దీంతో సాయంత్రం 6 గంటల తర్వాతగానీ రోడ్లపై ప్రజలు తిరుగాడలేరపోతున్నారు. జాతీయ ఉపాధిహామీ పథకం కూలీలు ఉదయం 6 గంటలకే పనుల్లోకి వెళ్లి 10.30 గంటలకు ఇళ్లకు చేరుకుంటున్నారు. గృహ నిర్మాణ పనులకెళ్లే కూలీలు, ఆరుబయట పనిచేసేవారి పాట్లు వర్ణనాతీతం. పిల్లలు, వృద్ధులు ఈ ఎండల వేడిని తాళలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శీతల పానీయాలు, కూలర్లు, ఏసీలకు బాగా డిమాండ్ పెరిగింది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయని వాతావరణ విభాగాధికారులు చెప్పున్నారు. ఏప్రిల్ నెలలోనే ఇంతటి ఎండలు ఉంటే రానున్న మే నెల మరెన్ని యాతనలు పడాల్సి ఉంటుందోనని జనం బెంబేలెత్తిపోతున్నారు.

అనకాపల్లిలో ఉష్ణోగ్రత గతేడాది, ప్రస్తుతం

	2022	2023
ఏప్రిల్ 10	36.2	36.9
ఏప్రిల్ 11	35.5	37.8
ఏప్రిల్ 12	35.7	38.3
ఏప్రిల్ 13	36.5	39.1
ఏప్రిల్ 14	36.3	39.8

ఆక్రమణలకు చరమ'గీతం'

- గీతం ఆక్రమణలపై మరోసారి అధికారుల చర్యలు
- రక్షిస్తున్న కొద్దీ కనిపిస్తున్న ఆక్రమిత భూములు
- గీతం చెరలో ఇంకా సుమారు 14 ఎకరాలున్నట్లు గుర్తింపు
- త్వరలోనే వాటిని కూడా స్వాధీనం చేసుకుంటామన్న అధికారులు
- ప్రభుత్వ భూమి పరిరక్షణలో భాగంగానే చర్యలు



గీతం యూనివర్సిటీలో ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకొని అధికారులు ఏర్పాటు చేసిన కంచె

సాక్షి, విశాఖపట్నం : గీతం అక్రమాల కంచె క్రమక్రమంగా తొలగిస్తూ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గతంలో టీడీపీ సర్కారు అండతో ప్రభుత్వ భూముల్లోనూ 'గీత' దాటి అక్రమ నిర్మాణాలు అడ్డగోలుగా నిర్మించేశారు. ఇప్పుడా కబ్జాల కంచెను తొలగించి రక్షణ వలయం ఏర్పాటు చేస్తున్నారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా.. భీమిలి రెవెన్యూ బృందం గీతంపై చర్యలకు ఉపక్రమించింది. గతంలో స్వాధీనం చేసుకున్న రూ. కోట్ల భూములను పరిరక్షిస్తూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసే ప్రక్రియను రెండో విడత పూర్తి చేసింది.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖలో భూ కుంభకోణాలపై చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటి వరకూ ఒకటి కాదు రెండు కాదు.. వేల కోట్ల రూపాయల ప్రభుత్వ భూములను కబ్జాదారుల కబంధ హస్తాల నుంచి అధికారులు విడిపించారు. ఇందులో భాగంగా గీతం ఆక్రమణ చెరలో ఉన్న భూములను కూడా స్వాధీనం చేసుకున్నారు. 2020 అక్టోబర్ 24న ప్రభుత్వ భూముల్లో గీతం నిర్మించిన ప్రహరీ, ఇతర నిర్మాణాలను తొలగించిన రెవెన్యూ అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. అయితే స్వాధీనం చేసుకున్న భూములు తిరిగి ఆక్రమణలకు గురి కాకుండా ఫెన్సింగ్ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో కొద్ది నెలల క్రితం రూ.190 కోట్ల విలువైన సర్వే నంబర్ 10,17,30లో మొత్తం 19.39 ఎకరాల ప్రభుత్వ భూమికి రక్షణ వలయం ఏర్పాటు చేశారు. తాజాగా శుక్రవారం మిగిలిన భూములకు సంబంధించిన చర్యలకు ఉపక్రమించారు. కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు తెల్లవారు జాము నుంచి భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ప్రారంభించారు. అధికారులు కంచె బిగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. 4.74 ఎకరాల్లో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములు సర్వే చేసి వాటి హద్దులు ప్రకారం సర్వే నెంబరు 15, 16, 19, 20 లలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం ఆక్రమణలకు గురైన 40 ఎకరాల్లో ఇప్పటి వరకు దాదాపు 26 ఎకరాలు స్వాధీనం చేసుకొని రక్షణ కంచెలు ఏర్పాటు చేశారు. మరో 14 ఎకరాల ప్రభుత్వ భూమిని త్వరలోనే స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. మిగిలిన ప్రభుత్వ భూమి హైకోర్టులో ఉన్నందున దాని ప్రకారం చర్యలు తీసుకుంటామని భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి తెలిపారు. కొత్తగా ఆక్రమణలపై చర్యలు తీసుకోవడం కాదని, గతంలో స్వాధీనం చేసుకున్న భూముల్లోనే ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

ముందస్తు చర్యల్లో భాగంగా...

అంబేడ్కర్ జయంతి సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో అధికారులు పాల్గొనాల్సి ఉండటంతో.. త్వరితగతిన కంచె పనులు ఏర్పాటు చేసేందుకు వేకువ జామునుంచే చర్యలు ప్రారంభించారు. సెలవు రోజుల్లో ఈ తరహా పనులు పూర్తి చేస్తే సాధారణ విధులకు ఆటంకం కలగదన్న ఉద్దేశంతో అధికారులు భావించారు. అయితే గతంలో గీతం వద్ద ఆక్రమణలు తొలగించినప్పుడు, రక్షణ కంచెలు ఏర్పాటు చేస్తున్న సమయంలో టీడీపీ శ్రేణులు విధులకు ఆటంకం కలగించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రభుత్వ భూములు సంరక్షించేందుకు చేపడుతున్న చర్యలను రాజకీయం కోసం టీడీపీ వాడుకోవడంతో అధికార యంత్రాంగం ఇబ్బంది పడింది. శుక్రవారం ఈ తరహా ఇబ్బందులు ఎదురవ్వకుండా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆర్‌డీవో భాస్కర్‌రెడ్డి తెలిపారు. టీడీపీ నేత గండిబాబ్జీ గీతంలోకి వెళ్లి హడావిడి సృష్టించేందుకు యత్నించారు. అయితే అధికారులు వివరంగా చేపడుతున్న చర్యలను చెప్పడంతో.. చేసేదేమీ లేక అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోవైపు గీతం ఆక్రమణలు నిజమేనని అర్థం చేసుకున్న స్థానిక టీడీపీ నేతలు అటువైపు కన్నెత్తికూడా చూడక పోవడం విశేషం.

ఇదీ గీతం ఆక్రమణల కథ

గత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 1998లో విశాఖ రూరల్ మండలం ఎండాడ సర్వే నంబరు 17/1 నుంచి 17/28 వరకు మొత్తం 71.15 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎకరా రూ. 18 వేల ప్రకారం గీతం ఇన్‌స్టిట్యూట్‌కు బదలాయింపు చేసింది. అయితే బదలాయింపు చేసిన భూమిని కాకుండా చాలా ఏళ్లుగా అదనంగా సుమారు 38.60 ఎకరాలు ప్రభుత్వ భూమి అనధికారికంగా ఆక్రమించినట్లు అధికారులు గుర్తించారు. జనవరి 6వ తేదీన సర్వే నిర్వహించి సుమారు 19.39 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. తిరిగి శుక్రవారం 4.74 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకుంది. ఇప్పటి వరకు 24.13 ఎకరాలు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా..దీని విలువ సుమారు రూ. 300 కోట్లు ఉంటుందని అంచనా. మిగిలిన 14.47 ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాల్సి ఉండగా.. ప్రస్తుతం హైకోర్టులో ఉంది.



స్వాధీనం చేసుకున్న స్థలం చుట్టూ కంచె

క్లుప్తంగా

ఎట్టకేలకు పట్టాలపైకి వారణాసి రైలు

తాటిచెట్లపాలెం: విశాఖ వాసులను ఊరిస్తున్న విశాఖపట్నం–వారణాసి(08588) రైలు వచ్చే బుధవారం పట్టాలెక్కనుంది. త్వరలో రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని వాల్తేర్ డివిజన్ అధికారులు పేర్కొన్నారు. ఈ వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ విశాఖలో ప్రతీ బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బయల్దేరుతుంది. ఏప్రిల్ 19, 26, మే 3, 10, 17 తేదీల్లో నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో వారణాసి–విశాఖపట్నం(08587) వీక్లీ స్పెషల్ ప్రతీ గురువారం సాయంత్రం 6 గంటలకు బయల్దేరుతుంది. ఈ రైలు ఏప్రిల్ 20, 27, మే 4, 11, 18 తేదీల్లో నడుస్తుంది. ఇరుమార్గాల్లో సింహాచలం, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగుడ, కేసింగ, టిట్లాఘడ్, బాలంగీర్, బార్‌గడ్ రోడ్, సంబల్‌పూర్, ఝార్సుగుడ, రూర్కెలా, హతియా, రాంచీ, మురి, బారకకన, లతేహర్, దల్తోంగంజ్, గార్వారోడ్, తదితర స్టేషన్లలో ఆగుతాయి.

ఆలయంలో చోరీ

మునగపాక: స్థానిక మెయిన్‌రోడ్డులో లింగరాయి గుడిలోని మూడు హుండీలను దొంగలు అపహరించారు. గుడి ఆవరణలో ఉన్న మూడు హుండీలను గురువారం అర్ధరాత్రి దాటాక తీసుకువెళ్లి సమీపంలోని కొబ్బరితోటలో పడేసి, వాటిలో ఉన్న నగదును ఎత్తుకుపోయారు.శుక్రవారం హుండీలు చోరీకి గురైనట్టు స్థానికులు గుర్తించారు. ఎస్‌ఐ మహమ్మద్ ఆలీకి ఆలయ చైర్మన్ సూరిశెట్టి రాము సమాచారం అందజేశారు. రూ.8వేలకు పైగా నగదు చోరీ జరిగినట్టు భావిస్తున్నారు.

నేత్రపర్వంగా శ్రీనివాసుని కల్యాణం


కల్యాణోత్సవంలో మైహోమ్ ఇండస్ట్రీస్ చైర్మన్ రామేశ్వరరావు దంపతులు


శ్రీనివాసుని కల్యాణంలో అహోబిలం జీయర్‌స్వామి

- అహోబిలం జీయర్‌స్వామి నేతృత్వంలో వేడుక

యలమంచిలి: మండలంలోని ములకలాపల్లి వద్ద మైహోమ్ ఇండస్ట్రీస్ (సిమెంట్ కర్మాగారం)లో శ్రీనివాస కల్యాణ మహోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. శ్రీలక్ష్మీ సమేత శ్రీనివాసుని 11వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇక్కడ యాగశాలలో నిత్యారాధన, చతుస్థానార్చన, మూలమంత్ర, హవన పారాయణాధికాలు, గరుడ వాహన సేవ, శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

ఈ కల్యాణ మహోత్సవంలో మైహోమ్ ఇండస్ట్రీస్ అధినేత జూపల్లి రామేశ్వరావు, కుమారి దంపతులు పాల్గొన్నారు. అహోబిలం జీయర్ స్వామి నేతృత్వంలో ఈ వేడుక జరిగింది. ఎమ్మెల్యే కన్నబాబురాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర కల్యాణ ఘట్టాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. అంతకుముందు మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జూపల్లి వినోద్‌కుమార్, భార్గవి దంపతులు, దూది నరసింహమూర్తి, గంధం శివ, తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడిని నిలదీయండి

- నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేస్తే మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడిని ఎక్కడికక్కడ నిలదీయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అమలాపురం సర్పంచ్ శెట్టి అచ్చిరాజుపై అయ్యన్నపాత్రుడు, టీడీపీ కార్యకర్తలు వ్యవహరించిన తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇదేం కర్మ కార్యక్రమానికి అమలాపురం వెళ్లిన అయ్యన్నపాత్రుడు తమ ప్రభుత్వంపై విమర్శలు చేశారన్నారు. అదే సమయంలో మెహర్బానీ కోసం స్టేజ్ మీదకు రమ్మంటేనే తమ సర్పంచ్ అచ్చిరాజు వెళ్లారన్నారు. తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి చెప్పుతానంటే మైక్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈ విషయంలో సర్పంచ్ నిలదీయడం తప్పు ఎలా అవుతుందన్నారు. రాష్ట్రాన్ని దోచుకున్న చంద్రబాబు, అయ్యన్నపాత్రుడు ఊళ్లమ్మట వెళ్తుంటే ఇదేం కర్మరా బాబు అని ప్రజలు చీదరించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి పట్టిన పెద్ద కర్మ వారేనన్నారు. ఇదేం కర్మ కార్యక్రమానికి వెళ్లినప్పుడు టీడీపీ హయాంలో చేసిన కుంభకోణాలు, ఇసుక, మరుగుదొడ్లు, నీరు–చెట్టు దోపిడీ గురించి చెప్పుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. 2014 ఎన్నికల్లో ఆరు వందల హామీలిచ్చి 60 కూడా నెరవేర్చలేని దౌర్భాగ్య పార్టీ టీడీపీ అని చెప్పుకుంటే ప్రజలు హర్షిస్తారన్నారు.

గ్రామాలకు వెళ్లి తమ ప్రభుత్వాన్నిగానీ, తమ నాయకులనుగానీ విమర్శిస్తే దీటుగా ప్రతి విమర్శలు చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. వైఎస్సార్ రైతు భరోసా, అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు ఇవ్వటం తప్పయితే చెప్పాలని సవాల్ విసిరారు.

రాజ్యాంగ ప్రదాత అంబేడ్కర్

- 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి మహేంద్ర ఫణికుమార్


నెహ్రూచౌక్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మహేంద్ర ఫణికుమార్


సంపతిపురంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం

అనకాపల్లి టౌన్: భారత దేశానికి రాజ్యాంగాన్ని ప్రసాదించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ అని పదో అదనపు జిల్లా న్యాయమూర్తి మహేంద్ర ఫణికుమార్ అన్నారు. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ చౌక్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి మాట్లాడారు. సమానత్వం, సౌభ్రాతృత్వం అనేసరికి గుర్తొచ్చే మొట్టమొదటి వ్యక్తి బాబా సాహెబ్ అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కనిశెట్టి సురేష్‌బాబు, న్యాయవాదులు శేఖర మంత్రి సాయి, హరశ్రీనివాసరావు, పరదేశి, పోలి ప్రకాష్, ఆడారి శరత్‌చంద్ర, రాంప్రసాద్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ధీరోదాత్తుడు అంబేడ్కర్ : ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం

అనకాపల్లి రూరల్: జనం కోసమే జీవించి వారి మనసులో నిలిచిపోయిన మహోన్నతుడు బాబాసాహెబ్ అంబేడ్కర్ అని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం అన్నారు. అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన అనకాపల్లి మండలం సంపతిపురంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సభలో మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శమంతమైనదని అభిప్రాయపడ్డారు. సామాజిక అణచివేత, దోపిడీ నుంచి షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఇతర బలహీన వర్గాలకు రక్షణ కల్పించడం కోసం నిర్విరామ కృషి చేశారని కొనియాడారు. దళితులు సాధికారత సాధించడానికి జీవితాంతం శ్రమించిన నాయకుడని, ఆయన కలలుగన్న పాలన అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మనోబంధు నిర్వాహకులు భూపతిరాజు రామకృష్ణంరాజు, సర్పంచ్ నంబారు నాగమణి, నంబారు శ్రీను, ఎంపీటీసీ కడిమి గణేష్, వెలుగుల బాబూరావు, ఈరుగుల శంకర్రావు, న్యాయవాది ఐఆర్ గంగాధర్, అంబేడ్కర్ సంఘం వ్యవస్థాపకుడు ఈరుగుల ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడిన యువకుడి మృతి


ప్రమాదంలో మృతి చెందిన సహదత్

యలమంచిలి: రైలు నుంచి జారిపడిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తుని రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ మారుఫ్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి 11 గంటల సమయంలో యలమంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు నుంచి సహదత్ (20) అనే యువకుడు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సహదత్ మృతి చెందాడు. ఈ యువకుడు బిహార్ రాష్ట్రం భాగాల్పూర్ జిల్లా ధనోరీ గ్రామం వాసిగా గుర్తించినట్టు రైల్వే ఎస్‌ఐ తెలిపారు. సహదత్ తమిళనాడు రాష్ట్రంలో హోటల్‌లో పని చేస్తున్నాడని తల్లిదండ్రులను చూడడానికి స్వగ్రామానికి వెళుతూ రైలు నుంచి జారి పడి మృతి చెందాడని చెప్పారు. మృతుడి తండ్రి సిరాజుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్‌ఐ చెప్పారు.

పోలీస్‌స్టేషన్ వద్ద నిరశన


నిరాహార దీక్ష చేస్తున్న జామి సింహాచలంనాయుడు తల్లి, ఇతర కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

- అనకాపల్లి డీఎస్పీ హామీతో విరమణ

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లికి చెందిన జామి సింహాచలంనాయుడు మృతికి కారకులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట మృతుడి తల్లి సింహాచలమ్మ శుక్రవారం నిరాహార దీక్ష చేపట్టింది. దేవరాపల్లిలో మార్చి 18న అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరి వేసుకొని తన కుమారుడు మృతి చెందాడని, ఈ కేసు విచారణను నిష్పక్షపాతంగా చేపట్టి, తమకు న్యాయం చేయాలని ఆమె కోరింది. ఆమెకు మద్దతుగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు దీక్షలో పాల్గొన్నారు. ముందుగా మృతుడి ఇంటి నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి నాలుగు రోడ్ల కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నివాళులర్పించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని దీక్షకు దిగారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ ఈ కేసు విచారణలో పోలీసుల వ్యవహార శైలి అనుమానాలకు తావిస్తోందన్నారు. బలమైన సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ అనుమానితులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని తెలిపారు. అధిక సంఖ్యలో ఆందోళనకారులు తరలి రావడంతో పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు. కె.కోటపాడు ఎస్‌ఐ ధనుంజయ్ వారితో చర్చలు జరిపారు. అనకాపల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావుతో ఫోన్లో మృతుడి బంధువులను మాట్లాడించారు. దేవరాపల్లి పోలీసులతో కాకుండా వేరే పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐతో విచారణ జరిపించాలని వారు కోరగా కె.కోటపాడు ఎస్‌ఐ ధనుంజయ్‌తో విచారణ జరిపిస్తామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు సాయంత్రం నిరాహార దీక్ష విరమించారు.

నాడు - నేడు పనులపై కలెక్టర్ సంతృప్తి

పరవాడ: స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో జరుగుతున్న నాడు–నేడు పనులు బాగున్నాయని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. పరవాడ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన నాడు–నేడు పనులు సంతృప్తికరంగా ఉన్నాయని ప్రశంసించారు. వసతి గృహ విద్యార్థులకు మెనూ సక్రమ రీతిలో అమలు చేయాలని.. వారికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని మ్యాట్రిన్‌ను ఆదేశించారు. వసతి గృహ విద్యార్థుల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- అగ్నిమాపక సేవల శాఖ డీజీ సునీల్‌కుమార్
- అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

అల్లిపురం: జిల్లాలో జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను శుక్రవారం అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ పీవీ సునీల్‌కుమార్ ప్రారంభించారు. ముందుగా ఆయన అగ్నిమాపక సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్, అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం అగ్నిమాపక శకటాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ డాబాగార్డెన్స్, అంబేడ్కర్ సర్కిల్, సంగం శరత్ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆశీలమెట్ట, సౌత్ జైలురోడ్డు, జగదాంబ, టర్నల్ చౌల్ట్రీ మీదుగా తిరిగి సూర్యాబాగ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా డీజీ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అగ్ని ప్రమాదాల వేళ.. అప్రమత్తతే శ్రీరామరక్ష అని పిలుపునిచ్చారు. ప్రాంతీయ అగ్నిమాపక అధికారి, జోన్–1 ఎన్.నిరంజన్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహనరావు, సహాయక జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్.కె.రమణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మోడరన్ ఫిష్ మార్కెట్ రెడీ

- హార్బర్‌లో రూ.2.75 కోట్ల వ్యయంతో నిర్మాణం
- 1,600 గజాల విస్తీర్ణంలో 120 సీట్ల సామర్థ్యం
- డిస్‌ప్లే టేబుళ్లు, కటింగ్, సింక్ ట్యాప్‌లు ఏర్పాటు
- ఇకపై పూర్తి పరిశుభ్ర వాతావరణంలో చేపలు లభ్యం
- వేట విరామం తర్వాత నుంచి చేపల అమ్మకాలు ప్రారంభం


ఫిష్ మార్కెట్ లోపల ఏర్పాటు చేసిన డిస్‌ప్లే టేబుళ్లు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఫిషింగ్ హార్బర్ రాష్ట్రంలోనే అతి పెద్ద చేపల రేవు. 1976లో ఏర్పాటైన ఈ హార్బర్ 64 ఎకరాల్లో విస్తరించి ఉంది. నిత్యం కొనుగోలు, అమ్మకందార్లతో కళకళలాడుతూ ఉంటుంది. అయితే చేపల క్రయవిక్రయాలకు సరైన సదుపాయం లేక ఏళ్ల తరబడి ఈ హార్బర్ అపరిశుభ్ర వాతావరణంతో సతమతమవుతోంది. ఎండ, వానల్లోనూ ఆరుబయటే జెట్టీపై బహిరంగంగా చేపల అమ్మకాలు, కొనుగోళ్లు జరపాల్సి వస్తోంది. ఇది ఇటు వర్తకులతో పాటు రిటైల్ కొనుగోలుదార్లకు చాలా ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ చేపల రేవులో అధునాతన ఫిష్ మార్కెట్ నిర్మాణాన్ని సంకల్పించింది. ఇందుకోసం రూ.2.75 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో 1,600 గజాల విస్తీర్ణంలో 120 సీట్ల సామర్థ్యం ఉండే మోడరన్ ఫిష్ మార్కెట్ సిద్ధమైంది. ఇటీవలే దీని నిర్మాణం పూర్తయింది. చేపలవేట విరామం పూర్తయ్యాక జూన్ 15 తర్వాత నుంచి ఈ కొత్త మార్కెట్ అందుబాటులోకి రానుంది.

ఫిష్ మార్కెట్లో సదుపాయాలివీ..

ఈ అధునాతన ఫిష్ మార్కెట్లో పలు సదుపాయాలున్నాయి. విక్రయించే చేపలను ఉంచడానికి డిస్‌ప్లే టేబుళ్లను అమర్చారు. ప్రతి స్టాల్‌కు సింక్ ట్యాప్‌లను ఏర్పాటు చేశారు. ఇంకా చేపలను కోయడానికి వీలుగా కటింగ్ సదుపాయాన్ని కల్పించారు. చేపలు విక్రయించే వారు, కొనుగోలు చేసే వారి కోసం మంచినీరు, విద్యుత్ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచారు. అంతేకాదు.. ఈ ఆధునిక చేపల మార్కెట్లో కూర్చునేందుకు వీలుగా కుర్చీలను సమకూర్చాలని విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ యాజమాన్యాన్ని మత్స్యశాఖ అధికారులు ఇప్పటికే కోరారు. ఇందుకు ఆ యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. ఈ మోడరన్ ఫిష్ మార్కెట్ అందుబాటులోకి వస్తే హార్బర్‌లో పరిశుభ్రమైన వాతావరణంలో చేపల క్రయవిక్రయాలు జరగడానికి వీలుంటుందని, దీనివల్ల నాణ్యత పెరుగుతుందని జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ 'సాక్షి'కి చెప్పారు.

బోట్ల వివరం	రిజిస్టరైనవి	నడుస్తున్నవి
మెకనైజ్డ్ బోట్లు	696	626
మోటారైజ్డ్ బోట్లు	450	405
బీచ్ ల్యాండింగ్ క్రాఫ్ట్స్ (బీఎల్‌సీ)	15	13
నాన్ మోటారైజ్డ్ సంప్రదాయ బోట్లు	150	135
మొత్తం	1,311	1,179

రూ.182 కోట్లతో ఆధునికీకరణ

విశాఖ ఫిషింగ్ హార్బర్‌ను సాగరమాల పథకంలో రూ.182 కోట్ల వ్యయంతో ఆధునికీకరణ చేపడుతున్నారు. ఇటీవలే వీటి పనులు కూడా మొదలుపెట్టారు. ఇందుకు సంబంధించిన డీపీఆర్‌లో నివేదించిన ప్రకారం.. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో 1,311 వరకు వివిధ రకాల బోట్లున్నాయి. వీటిలో మరబోట్లు 696, మోటారైజ్డ్ బోట్లు 450, బీచ్ ల్యాండింగ్ క్రాఫ్ట్స్ (బీఎల్‌సీలు) 15, సంప్రదాయ బోట్లు (నాటు పడవలు) 150 ఉన్నాయి. వీటిలో 1,179 వరకు వేట సాగిస్తున్నాయి. వీటి ద్వారా రోజుకు సగటున ఈ చేపల రేవుకు 150 టన్నుల చేపలు వస్తున్నాయి. రోజుకు 33 ట్రక్కుల చొప్పున నెలకు వెయ్యి ట్రక్కుల్లో చేపల రవాణా జరుగుతోంది. రోజుకు 135 ద్విచక్ర వాహనాలు, 15 నాలుగు చక్రాల వాహనాలు వస్తుంటాయి.

క్లుప్తంగా

గ్రామసభలో పలు తీర్మానాలు


కొత్తూరులో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

అనకాపల్లి రూరల్ : మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ సభ నిర్వహించారు. సెక్రటరీ ఆధ్వర్యంలో గ్రామసభలో పలు అంశాలు తీర్మానించారు. మంచినీరు, డ్రైనేజీ, వీధిలైట్లు , రహదారుల సమస్యలు పరిష్కరించాలని తీర్మానించారు. జగనన్న కాలనీ లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. పందుల కారణంగా ప్రజలకు వ్యాధులు సోకకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వైస్ చైర్మన్ బీవీ సత్యవతి, కో ఆప్షన్ సభ్యులు పీఎస్ఎస్ఎన్ జోసఫ్, సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్, కొత్తూరు పంచాయతీ సెక్రటరీ రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.

'న్యాయం జరగకుంటే ఆత్మహత్యే శరణ్యం'

అనకాపల్లిటౌన్ : తనకు న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యమని మండ మరియమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కొప్పాక గ్రామంలో తన ఇంటి వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్వేనంబర్ 15/4లో సెంటున్నర ఇంటికి సంబంధించిన పత్రాలు సక్రమంగా ఉండడంతో సుంకర నాగమణి వద్ద కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఆమె నీరుకుండ సాయిరామకృష్ణ వద్ద కొనుగోలు చేసిందని, సాయిరామకృష్ణ తండ్రి నీరుకుండ అప్పారావు నుంచి గిఫ్ట్ డీడ్‌గా సాయిరామకృష్ణకు వచ్చిందన్నారు. రామకృష్ణ సోదరీమణులు తనపై అకారణంగా దాడి చేసి ఇంట్లోంచి గెంటేయడంతో చేసేదేమీలేక పోలీసులను ఆశ్రయించినట్లు ఆమె మీడియా ముందు వాపోయారు. వెల్లడించారు. ఫేక్ పత్రాలతో తనను మోసం చేస్తున్నారని, రెవెన్యూ అధికారులు సైతం దొంగ పత్రాలని ధ్రువీకరించినట్లు ఆక్షేపించారు. సమావేశంలో దళిత ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షుడు డొక్కా నాగభూషణం, కార్యదర్శి నదిపిల్లి వేణుగోపాల్, గ్రామపెద్దలు ఉన్నారు.

గండి పూడ్చివేత

రాంబిల్లి: రజాల వద్ద మేజర్ శారద నదిపై గల తాత్కాలిక కల్వర్టుకు పడిన గండి పూడ్చివేత పనులు పూర్తయ్యాయి. రెండు రోజులపాటు ఈ పనులు నిర్వహించారు. రాళ్లు, కంకర వేసి గండిని పూడ్చారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 2,702 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,950	4,100
మొదటి రకం	3,850	4,090
రెండో రకం	3,410	3,840
మూడోరకం	3,210	3,400

అనకాపల్లి సినిమాలు

రుద్రుడు	రాజా
మీటర్	సత్యనారాయణ స్క్రీన్-1
దంజన్స్ అండ్ డ్రాగన్స్	సత్యనారాయణ స్క్రీన్-2
రావణాసుర	షిర్డీసాయి
శాకుంతలం (3డి)	పర్తిసాయి
విడుతల(పార్ట్-1)	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 90 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-36 యూనిట్లు, ఓ పాజిటివ్-46 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 229 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 201 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

అనాథ బాలల 'మిషన్ వాత్సల్య'ం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు
- అర్హులకు నెలకు రూ.4 వేల ఆర్థిక ప్రోత్సాహం
- అనకాపల్లి సీడీపీవో పరిధిలో 516 దరఖాస్తులు
- నేటితో దరఖాస్తుల స్వీకరణకు ముగియనున్న గడువు



మిషన్ వాత్సల్య లోగో


చిన్నారితో తల్లివ్యూ

అనకాపల్లి రూరల్ : తల్లిదండ్రులు ఇద్దరూ లేని, ఇద్దరిలో ఏ ఒక్కరైనా లేని అనాథ పిల్లలకు ఆసరాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య పథకాన్ని అమలుచేస్తున్నాయి. ఈ పథకంలో 18 ఏళ్ల లోపు వయసున్న పిల్లల సంరక్షణ, కనీస అవసరాలు తీర్చేందుకు ప్రతి నెలా రూ.4 వేలు చొప్పున ఉపకారవేతనం అందించనున్నారు. కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఈ పథకాన్ని నిర్వహిస్తోంది. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయి.

నేడే తుది గడువు

స్త్రీ, శిశు సంక్షేమశాఖ, బాలల సంరక్షణా విభాగం ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సిబ్బంది లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ పథకంపై విస్తృత ప్రచారం చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 15వ తేదీ శనివారంతో దరఖాస్తులు అందజేయడానికి గడువు ముగియనుంది. లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, ఐసీడీఎస్ సీడీపీవోతో కూడిన కమిటీ పరిశీలిస్తుంది. ఇక్కడ అర్హత పొందిన దరఖాస్తులను ఉమ్మడి విశాఖ జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయ జిల్లా బాలల సంరక్షణ విభాగానికి పరిశీలన నిమిత్తం పంపించి, తుది ఎంపిక ఖరారు చేస్తారు.

అర్హులు వీరే

- అనాథలై వేరొకరి ఇంట్లో ఆశ్రయం పొందేవారు.
- వితంతు లేదా విడాకులు తీసుకున్నవారి పిల్లలు
- తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో ఆర్థికంగా వెనుకబడిన వారు.
- న్యాయ ఆదరణ సంరక్షణ చట్టం 2015 ప్రకారం గుర్తించిన బాల కార్మికులు
- వీధి బాలలు, బాల యాచకులు
- హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు, హింస, దోపిడీకి గురైన వారి పిల్లలు
- వార్షిక ఆదాయం గ్రామాల్లో రూ.72 వేల లోపు, పట్టణ ప్రాంతంలో రూ.96 వేలకు మించని వారి పిల్లలు

దరఖాస్తుకు జత చేయాల్సిన పత్రాలు

- తల్లీ లేదా తండ్రి చనిపోయి ఉంటే వారి డెత్ సర్టిఫికెట్
- తల్లిదండ్రులు, పిల్లల ఆధార్, రేషన్‌కార్డులు
- పిల్లల బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు
- తల్లి/తండ్రి/సంరక్షకుడితో పిల్లల జాయింట్ బ్యాంక్ ఖాతా, లేదా పిల్లల పేరున ప్రత్యేక బ్యాంక్ ఖాతా, ఇద్దరు పిల్లలుంటే రెండు వేర్వేరు ఖాతాలుండాలి.

నిధుల కేటాయింపు, కాలపరిమితి

కేంద్ర ప్రభుత్వం 60శాతం(రూ.2,400), రాష్ట్ర ప్రభుత్వం 40శాతం(రూ.1,600) నిధులను అర్హులైన పిల్లల ఖాతాలకు జమ చేయనున్నారు. 18 ఏళ్ల లోపు వారికే పథకం వర్తిస్తుంది. ఏ సమయంలోనైనా పిల్లలను హాస్టల్ గానీ, బాలసదనంలో గాని చేర్పిస్తే పథకం రద్దవుతుంది. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు మినహా, పాఠశాలలకు వెళ్లే పిల్లల వరుసగా 30 రోజులపాటు గైర్హాజరైతే, ఈ పథకాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తారు.

516 దరఖాస్తులు

అనకాపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అనకాపల్లి అర్బన్‌లో 74, రూరల్‌లో 91, కశింకోట మండలంలో 69 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి నుంచి ఇప్పటి వరకూ ఈ పథకానికి 516 దరఖాస్తులు వచ్చాయి. శనివారంతో దరఖాస్తుల గడువు ముగియనుండడంతో, అర్హులెవరైనా ఉంటే సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

అనాథ బాలల్ని గుర్తిస్తున్నాం



తల్లిదండ్రుల్లేని, చదువుకుంటున్న బాలల్ని గుర్తిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ఈ పథకం ప్రాముఖ్యతను వివరిస్తున్నాం. నా పరిధిలో ఇప్పటికే అర్హులైన పిల్లలను గుర్తించి దరఖాస్తు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నా. ఇలాంటి బాలలకు ఈ పథకం చాలా ప్రయోజనకారి.

– కె.లక్ష్మీకాంతం, అంగన్‌వాడీ కార్యకర్త, బుద్ధరామదాసు వీధి

ఇద్దరు పిల్లల భవిష్యత్తుకు ఆసరా



నా భర్త రెండేళ్ల క్రితం చనిపోయాడు. నాకు ఇద్దరు ఆడపిల్లలు. వారిని చదివించుకోవడం చాలా ఇబ్బందిగా ఉంటోంది. మిషన్ వాత్సల్య పథకం గురించి చెప్పారు. ఈ పథకం ఇస్తే మా పిల్లల భవిష్యత్తుకు ఎంతో ఆసరాగా ఉంటుంది. పిల్లల్ని ధైర్యంగా చదివించుకోగలను.

– కె గంగా భవాని, బుద్ధరామదాసు వీధి,అనకాపల్లి

సద్వినియోగం చేసుకోండి



అనాథ పిల్లలను అన్ని విధాలా ఆదుకునేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య పథకాన్ని అమలుచేస్తున్నాయి. ఈ పథకానికి ఎంపికైతే 18 ఏళ్ల వయసు వచ్చే వరకు వారి ఆలనాపాలనా గడిచిపోతుంది. అనకాపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఆయా గ్రామాల్లోని అనాథ పిల్లలను గుర్తించే ప్రక్రియ మొదలెట్టాం. అలాంటి వారిని గుర్తించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కీలకంగా వ్యవహరిస్తున్నారు.

– పి.ప్రభావతి, సీడీపీవో, అనకాపల్లి

పంట కాలువ ఆక్రమించారని ఆందోళన


తాళ్లపాలెం సిమెంట్ పరిశ్రమ రోడ్డుపై నిరసన

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలోని ఓ ప్రైవేటు సిమెంట్ పరిశ్రమ నిర్వాహకులు పంట కాలువను ఆక్రమించి రోడ్డు నిర్మించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ రైతులు, యువకులు, ప్రజలు శుక్రవారం అడ్డుకున్నారు. పరిశ్రమకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్ల కార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. కాలువ ఆక్రమించి రోడ్డు నిర్మాణాన్ని ఆపాలని, కాలుష్యం నివారణకు, రోడ్డు ధ్వంసమవుతున్నందున భారీ వాహనాలను నడపరాదని డిమాండ్ చేశారు. దీంతో పరిశ్రమ నిర్వాహకులు సానుకూలంగా స్పందించి ఆందోళనకారులతో చర్చలు జరడంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు. తాళ్లపాలెం మాజీ మునసబు చిన్ని సన్యాసినాయుడు, సర్పంచ్ చిన్ని వల్లభనారాయణరావు, ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి సతీష్, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు చిన్ని రాజీవ్, డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, స్థానికులు మార్పురెడ్డి ప్రవీణ్, ఉల్లింగల రమేష్, ఎర్రంశెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

పరవాడ: తానాం బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 16న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బి.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. తానాం గురుకుల పాఠశాలలో 372 మంది ప్రవేశ పరీక్షకు హాజరు కానున్నారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

- ఊరూ వాడా ఘనంగా అంబేడ్కర్ జయంతి



నెహ్రూచౌక్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కరణం ధర్మశ్రీ, రవి పట్టాన్‌శెట్టి


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విప్ దర్మశ్రీ, ఎంపీ సత్యవతి


పట్టణ ఉపకారాగారంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన అధికారులు


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, సర్పంచ్ నరసింగరావు

అనకాపల్లి టౌన్ : మహనీయులు చూపిన బాటలో నడిచి, నేటి యువత దేశాభివృద్ధికి తోడ్పడాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సూచించారు. స్థానిక జాతీయ రహదారి కొత్తూరు సమీపంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతితో కలిసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి రాష్ట్రంలో 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం తమదేనన్నారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారత రాజ్యాంగానికి ఎంతో గుర్తింపు తీసుకువచ్చిన అంబేడ్కర్ ఆశయాల మేరకు నేటి యువత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, గొలగాం ఎంపీటీసీ నారిపిన్ని చంద్రశేఖర్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షురాలు సుజాత, పార్టీ సీనియర్ నేతలు సత్యనారాయణ, ప్రభాకర్, కోలంకి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


తాళ్లపాలెంలో బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులు

- స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజులరమేష్, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, గైపూరి రాజు పాల్గొన్నారు.
- అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజారవాణాశాఖ జిల్లా అధికారి పద్మావతి అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై, అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. డిపో మేనేజర్ సుజాత, ఏఎం రవిచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.
- భారత తొలి న్యాయశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మొట్టమొదటి వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. భీమునిగుమ్మం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.
- పూల్‌భాగ్ రహదారిలో బీఎస్పీ, రిక్షా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- రామచంద్ర థియేటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.
- మండలంలో కొత్తూరు కూడలిలో జిల్లా దళిత బహుజన ఆదరణ సేవా సమితి ఆధ్వర్యంలో సమితి జిల్లా అధ్యక్షుడు కొల్లి చిన అప్పారావు, కట్టమూరి మంగరాజు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- మామిడిపాలెం జెడ్పీహైస్కూల్లో హెచ్ఎం శ్రీధర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- భీమునిగుమ్మంలో అంబేడ్కర్ విగ్రహానికి 82వవార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీ రామరాజు నివాళులర్పించారు. పార్టీ నేతలు రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.
- స్థానిక బాలుర వసతిగృహం వద్ద బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి.
- భీమునిగుమ్మం విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో పరిషత్ సభ్యులు వాసు, తాతాజీలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద సర్వేజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆస్పత్రి గైనకాలజిస్ట్ అనురాధ నర్సింగ్ స్టాఫ్, పారిశుధ్య సిబ్బందికి అల్పాహారం అందజేశారు.
- స్థానిక హెడ్‌పోస్టాఫీసు వద్ద జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు సతీష్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.
- స్థానిక ఉడ్‌పేట హ్యాపీకిడ్స్ ప్లేస్కూల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి. చిన్నారులచే అంబేడ్కర్ గ్రీటింగ్ ఫొటోలు ప్రదర్శించారు.
- భీమునిగుమ్మం, విజయరామరాజుపేటల్లో టీడీపీ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తుమ్మపాల : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా పట్టణ ఉప కారాగారంలో అంబేడ్కర్ చిత్రపటానికి కారాగార పర్యవేక్షణ అధికారి వైఎస్ గణేష్ రెడ్డి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. వార్డర్స్ అప్పలనాయుడు, ముత్యాలనాయుడు, భవానీ, సిబ్బంది పాల్గొన్నారు.

- గొలగాం పంచాయతీ ఎల్లారమ్మ కాలనీలో ఎంపీపీ గొర్లి సూరిబాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శెలపురెడ్డి నాగనరసింగరావు, జైభీమ్ సభ్యులు గుబ్బల నూకలతల్లి, తెన్నడ రాము, సీహెచ్ చంద్రకళ, చపల నూకరాజు పాల్గొన్నారు.

కశింకోట : పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మంత్రి జయరజని, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజిమెన్, ఎంపీటీసీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

- కశింకోట పోలీసు స్టేషన్ వద్ద, ఇందిరా కాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హౌసింగ్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. అసెంబ్లీ కాంగ్రెస్ సమన్వయ కమిటీ సభ్యులు మల్లపురెడ్డి కోటేశ్వరరావు, జిల్లా న్యాయ విభాగం అధ్యక్షుడు సూరా శ్రీనివాస్, అసెంబ్లీ ఇన్‌చార్జి బోయిన భానుమూర్తి, పార్టీ కార్యదర్శి కత్తెర శ్రీధర్ పాల్గొన్నారు.
- తాళ్లపాలెం పంచాయతీలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, సచివాలయ కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.
- తాళ్లపాలెం గ్రంథాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి గ్రంథాలయ అధికారి కె.జగన్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.
- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పొన్నగంటి అప్పారావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొణతాల రాజాబాబు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : స్థానిక ఏఎస్‌కే ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత్‌రాజేంద్ర ప్రసాద్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబా సాహెబ్ అంటే సింబల్ ఆఫ్ నాలెడ్జ్ అన్నారు. ఈ దేశానికి రాజ్యాంగం ప్రసాదించిన మహనీయుడన్నారు.


వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్లు


భీమునిగుమ్మం వద్ద నివాళులర్పిస్తున్న మందపాటి సునీత, జానకీరామరాజు దంపతులు


నివాళులర్పిస్తున్న జిల్లా ఆర్టీసీ అధికారి పద్మావతి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దాడి రత్నాకర్

జనం నమ్మకం జగన్


మహిళకు సంక్షేమ పథకాలతో రూపొందించిన బ్రోచర్‌ను అందిస్తున్న రామ్మూర్తి


జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఇంటింటికీ బ్రోచర్లు అందిస్తున్న ఎంపీటీసీ లగిశెట్టి భవాని

అనకాపల్లిటౌన్ : పట్టణంలో పలు చోట్ల వైఎస్సార్‌సీపీ నేతలు శుక్రవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. వేల్పులవీధి, భవానీవీధుల్లో పార్టీ సీనియర్ నాయకుడు, వైద్యుడు రామ్మూర్తి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. వృద్ధులకు, మహిళలకు సీఎం జగన్ ఫొటో ఉన్న స్టిక్కర్లు అందించారు. పార్టీ నేతలు ముత్త వెంకటరమణ, కొంకి శ్రీరామ్మూర్తి, రైతులపూడి రాజు, పీలా శ్రీనివాసరావు, పనసపెద్ద సత్యనారాయణ, ఇంజరపు ప్రసాద్, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని శుక్రవారం రాత్రి ×జగనన్నే మా భవిష్యత్తు×కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. మా నమ్మకం నువ్వే జగన్, స్టిక్కర్లు అతికించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనా తీరుపై రూపొందించిన ప్రశ్నావళితో సర్వే నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు లగిశెట్టి గణేష్, గుమ్మడి నారాయణరావు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

'బీజేపీని సాగనంపుదాం'

అనకాపల్లి రూరల్ : ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీని సాగనంపి, దేశాన్ని కాపాడుకోవాలని వామపక్ష పార్టీల నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం అనకాపల్లిలో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార పోరు యాత్రను ప్రారంభించారు. బాలేపల్లి వెంకట రమణ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదం బారిన పడిందని, దీనికి కారణం బీజేపీ ప్రభుత్వ విధానాలేనని ఆరోపించారు. ర్యాలీలో సీపీఐ నేతలు రాజాన దొరబాబు, వైఎస్ భద్రం, వియ్యపు రాజు, బాలకృష్ణ, శంకరరావు, గంటా శ్రీరామ్, వీరాచారి పాల్గొన్నారు.

తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు

కశింకోట : వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని, సిబ్బందిని ఎంపీడీవో కొంకి అప్పారావు ఆదేశించారు. కశింకోట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మంత్రి జయరజని అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం మెరుగుకు జగనన్న స్వచ్ఛ సంకల్పంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న నవ రత్నాలు, వివిధ సంక్షేమ పథకాలకు అర్హుల్ని గుర్తించాలన్నారు. 2022-23 సాధారణ బడ్జెట్‌కు సభ ఆమోదించింది. సభలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ వార్డు సభ్యులు, సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

మండలంలోని తాళ్లపాలెం పంచాయతీలో కూడా పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి సమక్షంలో గ్రామ సభ నిర్వహించి బడ్జెట్‌ను ఆమోదించారు.

నిత్యం యోగాతో ఆరోగ్యం


మొక్కలు నాటుతున్న డీఎంహెచ్‌వో హేమంత్

కశింకోట : నిత్యం యోగా ఆరోగ్యానికి దోహదం చేస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎ.హేమంత్ అన్నారు. కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆరోగ్య మేళా ప్రారంభించారు. యోగాభ్యసన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం, మానసిక ఆనందం కలుగుతాయన్నారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు. పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారులు తిరుపతిరావు, యశోద, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, జిల్లా ప్రోగ్రాం అధికారులు శారదాబాయి, మురళీకృష్ణ, లూసీ కార్డిలియా, కిషోర్ కుమార్, పారా మెడికల్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

సబ్బవరం: అగ్నిమాపక వారోత్సవాలను శుక్రవారం అగ్నిమాపక అధికారి దిలీప్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 14 నుంచి 20 తేదీ వరకూ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అమర వీరులకు నివాళులర్పించారు. గృహాలు,కర్మాగారాలు,వ్యాపార సముదాయాలు, గిడ్డంగులు,తాత్కాలిక నిర్మాణాల్లో అగ్నిమాపక నివారణ పద్ధతులను పాటించడం ద్వారా అగ్నిప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్స్ కె. అప్పలనాయుడు,కె. రాజారావు,కె. ఎల్లాజీ, ఫైర్ మెన్స్ పి. గౌరీశంకర్,టి. వెంకటరావు,కె. మహేశ్వరరావు, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.